భావికాల ప్రణయోదంతములు ప్రతిధ్వనించుచున్నవి. కుసుమ సౌరభభరంబున మలయానిలము మందగతుల వీచుచున్నది. భావిసౌభాగ్యగర్వంబున నెల్లిపాపకనులర మోడ్పుఁ జెందుచున్నవి.

నెల్లిపాప తల్లియు రేపకడ లేచి కూఁతునకుఁ దలయంటి పుట్టమట్టితో నొడలెల్లఁ దోమి సెలయేటినీట జలకమార్చి, చాకింటి కోకఁ గట్టఁబెట్టి, కొనగోట కురులు చిక్కుదీసి సోరకొప్పిడి, వన్యప్రసూనంబులఁ బాయలపాయలం దుఱిమి, చెక్కుల పుప్పొడి నలంది, జేవురుబొట్టు పెట్టి, కన్బొమలనడుమ బూదిరేక నిడి వసంతంబు దిగఁదుడిచి పారపోసి, కూఁతుం దోడ్కొని వనముఖంబునకుం జని అందు రేమెల్ల వేచికొనియున్న చంద్రశేఖరుని చేతఁ గూఁతుని చేయిడి, "రాజా! గోల, భద్రము సుమా!" యని 'బహుపరాకు' సెప్పి రహస్యముగఁ దన ముద్దుకూఁతునకు మగుడ మగుడ బుద్ధులు గఱపి వారి నిర్వుర దీవించి వీడ్కొలిపె.

ఆహా! మట్టిలోని మానికము మూర్ధాభిషిక్తుని శిరంబున ముద్దులు గులుకుచున్నది! తంపరలోని తమ్మి దైవమ్ము శిరమ్మునఁ దాండవ మాడుచున్నది! అడవిలోని నెల్లిపాప యందల మెక్కి కులుకుచున్నది.

3

"నందనోద్యానమువలె ననంత వసంత శోభల నలరారు మన్మనోహరుని మనోవనసీమం బ్రతిష్ఠించికొనిన నా ప్రణయపాంచాలిక నట్టిట్టాడించి పాదు కదల్చి పడఁద్రోయు నీర్ష్యంఝామారుతమున నా కూపి రాడకున్నది. తద్దేవతం బూజింప నాపూనిన కుసుమమాలికలు పసదొరంగి వసివాడి పోవుచున్నవి. తత్పదకమలంబుల నిదానంబున ధ్యానించు మదీయబుద్ధిలత వడవడ వడంకుచున్నది. వినిర్మల ప్రణయచంద్రికాధావళ్యంబుల వెదఁ చల్లు మదీయ వీక్షణాంచలంబుల నీర్ష్యారుణిమ పొడసూపుచున్నది. వలపుపూఁదేనియలఁ జిలుకు నాపలుకులలో సవతువెగటుఁదనము తలసూపుచున్నది. అక్కటా! త్రిలోక మన్మథమన్మథుఁడయిన మన్మనోహరుం డేడ? పల్లెలఁ దిరిగి కూరలమ్ముకొను నెల్లిపాప యేడ? సుందరతరు నాశ్రయించి కొనలుసాఁగి పూవుటీరములనల్లికొనిన నా ప్రేమలతిక నేఁ డీయెమ్మెలాఁడి కారణంబున వసివాడి పసఁదొరంగి నేల జీరాడవలయునా? వాని యీవిపరీతవిలాసంబునకు నా ప్రాణనాథుని నేనేమియుననను. 'ఎన్ని పూవులన్ వాలదు తేఁటి?' మగవాఁడను వానికి దోషమున్నదే?' కాని యీ చెట్టపడంతి మట్టుమీరి తట్టుంబెట్టిన మిట్టపిల్ల మట్టుమిట్టి పడుచున్నది. మువ్వేళల నన్నే నొవ్వనాడుచున్నది. ఉత్కృష్టమర్యాదల నెఱింగి యున్నత స్వభావంబుల నలవఱచికొన్న నేనీమె కెట్లు మారుసేఁత లొనర్పఁగలను? ఇట్లు నాలో నేను కుమిలి మిన్నకుందునన్న దాని గర్వంబు పట్టపగటింటి సూర్యునివలెఁ దేఱిచూడ నశక్యమగుచున్నది! ఈ కొంటెపడుచు తన తొంటి

